

**రక్షాబంధన్ కోలాహలం** ▶ రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆదివారం మార్కెట్లన్నీ రంగురంగుల రాఖీలతో ఆకట్టుకున్నాయి. మహిళలతో సందడిగా మారాయి.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 19 ఆగస్టు 2024 | HYDERABAD





**బాధ్యత లేదా..?** ▶ చెత్త వేయరాదని బోర్డు ఏర్పాటు చేసినా... దాని పక్కనే వ్యర్థాలు పడేశారు.. చిలుకానగర్‌లో కనిపించిన దృశ్యం

## బాలికతో అసభ్య ప్రవర్తన

**కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిపై పోక్సో కేసు**

సైదాబాద్, ఆగస్టు 18 : ఓ ప్రభుత్వ ఉద్యోగి తన ఇంటి సమీపంలో నివసించే బాలికకు మాయ మాటలు ..అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఓ బస్తీలో నివాసముండే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి (55) తన ఇంటి పక్కనే నివసించే బాలిక (12)తో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో పోలీసులను ఆశ్రయించగా, వారు కేసు నమోదు చేసేందుకు నిరాకరించారు. బాలిక తండ్రి ఓ పోలీస్ అధికారి ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తుండటంతో ఆయనకు విన్నవించుకొన్నాడు. దీంతో పోలీసు ఉన్నతాధికారుల అదేశాల మేరకు, నిందితుడిపై సైదాబాద్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మట్టి గణపతి.. గట్టి సంకల్పం..

**ఈ సారి 5 లక్షల విగ్రహాల పంపిణీ**

సిటీబ్యూరో, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ ) : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది 5 లక్షల మట్టి విగ్రహాలను జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, పీసీబీ శాఖలు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాయి. మట్టి గణపతులనే పూజిద్దామంటూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు తమ వంతు బాధ్యతగా ఉచితంగా 8 అంగుళాల పొడవుతో కూడిన మట్టి విగ్రహాలను అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు 8 ఇంచులు, ఒక అడుగు, 1.5 అడుగుల ఎత్తులో మట్టి విగ్రహాల తయారీకి టెండర్లను ఆహ్వానించేందుకు కసరత్తును పూర్తి చేశారు. ఈ నెలాఖరులోగా ఆ ప్రక్రియను పూర్తి చేసి.. వచ్చే నెల మొదటి వారంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేయనున్నారు.

## రాఖీ రద్దీ.. ఉప్పల్..తిప్పల్..





వీకెండ్‌తో పాటు సోమవారం రాఖీ పౌర్ణమి నేపథ్యంలో ఆదివారం ఊర్లకు వెళ్లేవారితో ఉప్పల్ రింగ్‌రోడ్డు రద్దీగా మారింది. ఉప్పల్-నాగోల్, ఉప్పల్-వరంగల్, ఉప్పల్ రింగ్‌రోడ్డు ప్రాంతం వాహనాలతో కిక్కిరిసిపోయింది. ప్రయాణికులు గంటల కొద్దీ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి అవస్థలుపడ్డారు. మరోవైపు సోదరులకు రాఖీ కట్టేందుకు బయలుదేరిన మహిళలకు సరిపడా బస్సులు లేకపోవడంతో ఉప్పల్ బస్టాండ్ వద్ద వారికి నిరీక్షణ తప్పలేదు. - ఉప్పల్, ఆగస్టు 18

# దడ పుట్టిస్తున్న హైడ్రా

**కొనసాగుతున్న ఆక్రమణల కూల్చివేతలు** • 'గండిపేట ఎఫ్‌టీఎల్'లో వెలిసిన నిర్మాణాల నేలమట్టం

**ఆక్రమణదారుల గుండెల్లో 'హైడ్రా' దడ పుట్టిస్తున్నది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాలను నేలమట్టం చేస్తున్నది. తాజాగా నగరానికి తాగునీరు అందించే గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్‌లో అడ్డగోలుగా వెలిసిన అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపింది. భారీ పోలీసు బందోబస్తు నడుమ అధికారులు ఆక్రమణలను కూల్చివేశారు.**

- మణికొండ/ మొయినాబాద్, ఆగస్టు 18



గండిపేట చెరువు ఖానాపూర్ సమీపంలో వెలిసిన అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

వారం రోజులుగా హైడ్రా అధికారులు గండిపేట చెరువు సమీపంలోని ఖానాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో పర్యటించి.. దాదాపు పది అక్రమ నిర్మాణాలను గుర్తించారు. నిర్మాణదారులకు ముందస్తుగా నోటీసులు జారీ చేసినా.. వారి నుంచి నిర్దేశించిన సమయంలో ఎలాంటి సమాధానం రాకపోవడంతో ఆదివారం రెండు అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసినట్లు అధికారులు వెల్లడించారు. గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ చిలుకూరు, అప్పోజిగూడ గ్రామ పంచాయతీ రెవెన్యూను ఆనుకుని ఉంటుంది. ఓ రియల్ వ్యాపారి గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్‌ను కలుపుకొని వెస్ట్ సైడ్ అనే వెంచర్‌ను చేయగా, కొందరు బడాబాబులు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాట్లు కొనుగోలు చేసి.. దర్గాగా లేక్ వ్యూవ్‌తో పాటు గచ్చిబౌలి, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ భవన అంతస్తుల వ్యూ కనిపించే విధంగా ఎఫ్‌టీఎల్‌లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలో అధికారులు సర్వే చేయగా, అప్పోజిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో మూడు భవనాలు, చిలుకూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఒక నిర్మాణం అక్రమంగా నిర్మించినట్లు గుర్తించారు. అధికారులు పూర్తి స్థాయిలో నివేదికను హైడ్రాకు నివేదించారు. ఈ క్రమంలో హైడ్రా ఆదివారం ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు శ్రీకారం చుట్టింది. హైడ్రా అధికారులు మల్లికార్జున్, చరణ్‌తో పాటు హెచ్‌ఎంఎస్‌ఎస్‌బీ డీజీఎం నరహరి, జలమండలి విజిలెన్స్ అధికారి లక్ష్మీరెడ్డి, స్థానిక సీఐ పవన్‌కుమార్‌రెడ్డి భారీగా పోలీసు బలగాలతో కూల్చివేతలకు వచ్చారు. ఉదయం 11 గంటలకు నుంచి సాయంత్రం 6 గంటల వరకు కూల్చివేతల పర్వం కొనసాగింది. అప్పోజిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు భవనాలను, చిలుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఒక నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. దేవలం వెంకటాపూర్ గ్రామ సమీపంలోని గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాన్ని సైతం కూల్చి వేశారు. యజమానులు అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా వెనకడగు వేయకుండా అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించారు.

## నో ఎంట్రీ సమయంలో భారీ వాహనాలను అనుమతించొద్దు

**ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలి**

**ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్**

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 18: హబ్సిగూడలో లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోయిన బాలిక కుటుంబంతో పాటు తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కొమురెల్లి బాబు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ నో ఎంట్రీ సమయంలో భారీ వాహనాలు నగరంలోకి అనుమతించడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. నో ఎంట్రీ సమయంలో భారీ వాహనాలను అనుమతించకూడదని కోరారు. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారులు ప్రమాదాలు జరిగినప్పుడే హడావుడి చేస్తున్నారే తప్ప..పూర్తిస్థాయిలో నియంత్రించడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు. నిరసన కార్యక్రమంలో యూనియన్ నాయకులు జోగు రాములు, శ్రీహరి, హుస్సేన్, శివ, రవికాంత్, వెంకట్ గౌడ్, సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న ఆటో యూనియన్ నాయకులు



## రద్దీలేని మార్గాల్లో మెట్రోనా..?

**గందరగోళంగా ఫోర్త్ సిటీ మెట్రో అలైన్‌మెంట్**

సిటీబ్యూరో, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): రద్దీ ఎక్కువగా ఉండే మార్గాల్లో మెట్రో రైలు మార్గం అందరికీ ప్రయోజనం. ప్రస్తుత అవసరాలే కాకుండా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మౌలిక వసతుల ప్రాజెక్టుల రూపకల్పన చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. అయితే రేవంత్‌రెడ్డి సర్కార్ గత ప్రభుత్వం చేపట్టిన బహుళ ప్రయోజనాలు కలిగిన భారీ ప్రాజెక్టులను రద్దు చేసి..కొత్తగా చేస్తున్న ప్రతిపాదనలు గందరగోళంగా, ఆగమ్య గోచరంగా ఉంటున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించిన ఫోర్త్‌సిటీ మెట్రో మార్గంపై అప్పుడే విపరీతమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శాస్త్రీయంగా ట్రాఫిక్‌ను అధ్యయనం చేసి అత్యంత యోగ్యమైన మెట్రో రాయదుర్గం-శంషాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో మార్గాన్ని గుర్తించారు. ఈ మార్గాన్ని నిర్మించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం డీపీఆర్ రూపకల్పనతో పాటు క్షేత్ర స్థాయిలో పనులు పూర్తి చేసింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఎయిర్‌పోర్టు మెట్రోను రద్దు చేసింది. దాని స్థానంలో నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు, మరో మార్గాన్ని మైలార్‌దేవ్‌పల్లి, ఆరాంఘర్ మీదుగా కొత్త హైకోర్టు వరకు నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. గత కేసీఆర్ ప్రభుత్వం ఫార్మాసిటీకి ఉన్న భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఎయిర్‌పోర్టు వరకు వచ్చిన మెట్రో మార్గాన్ని పొడిగిస్తూ..హైదరాబాద్-శ్రీశైలం హైవేపై తుక్కుగూడ మీదుగా మహేశ్వరం, కందుకూరు వరకు మెట్రో మార్గాన్ని మూడో దశలో నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల మీదుగా గత కేసీఆర్ ప్రభుత్వం మెట్రో ప్రతిపాదనలు చేస్తే, వాటిని పూర్తిగా పక్కన పెట్టి..కొత్త మెట్రో మార్గాలను అష్ట వంకర్లు తిప్పుతూ.. ఫోర్త్ సిటీ వరకు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తాజాగా ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

### ప్రతిపాదిస్తున్న మార్గంలో..

కొత్తగా నిర్మిస్తున్న హైకోర్టు నుంచి ఎయిర్‌పోర్టు లోపలి నుంచి తుక్కుగూడ, కొంగరకలాన్ ఓఆర్‌ఆర్ ఇంటర్‌చేంజ్ మీదుగా ఫోర్త్ సిటీగా చెబుతున్న ప్రాంతానికి ప్రతిపాదిస్తున్న మెట్రో మార్గంలో.. రద్దీ లేని ప్రాంతాలే ఉన్నాయి. ముఖ్యంగా కొంగరకలాన్ నుంచి 18 కి.మీ మేర ఫోర్త్ సిటీ వరకు ప్రతిపాదిస్తున్న మార్గంలో రోడ్డు మార్గమే లేని చోట కొత్తగా రోడ్డును, ఫై ఓవర్‌ను నిర్మిస్తున్నా.. దానిపై మెట్రో మార్గాన్ని నిర్మిస్తామని ప్రకటించడం పట్ల రవాణా రంగ నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## సుంకిశాల ఘటనపై విజిలెన్స్ విచారణ

పెద్దవూర: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం సుంకిశాల ప్రాజెక్టులో రిటైనింగ్ వాల్ కూలిన ఘటనపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేపడుతున్నారు. ఈ మేరకు బృందం సభ్యులు ఆదివారం సుంకిశాల ప్రాజెక్టును పరిశీలించారు. గోడ కూలడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంత ప్రమాదం జరిగినా తమ దృష్టికి రాలేదని, సోషల్ మీడియా, మీడియా చానెళ్ల ద్వారానే వివరాలు తెలుసుకున్నామని అక్కడి అధికారులు పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మాట్లాడుతూ.. ఘటన ఈ నెల 2న జరిగినా తమకు ఈ మధ్యనే తెలిసిందని, దీనిపై పూర్తి దర్యాప్తు చేసిన తర్వాత తదుపరి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఏ మేరకు నష్టం జరిగిందనే విషయమై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ప్రాజెక్టును సందర్శించిన వారిలో అడిషనల్ ఎస్పీ ఆనంద్‌కుమార్, డిప్యూటీ ఇంజినీరింగ్ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



# క్యా మతలబ్ హై..



పది రోజుల కింద రోడ్డు ఆక్రమణను తొలగిస్తున్న అధికారులు (ఫైల్)





తాజాగా వాహనాల పార్కింగ్ కోసం మళ్లీ రోడ్డును ఆక్రమించిన దృశ్యం

బోరబండ ప్రధాన రహదారిపై సైట్-1 కాలనీ సమీపంలో రోడ్డు మలుపు వద్ద ఇటీవల ఓ హోటల్‌ను ప్రారంభించారు. అయితే నిర్వాహకులు వాహనాల పార్కింగ్ కోసం ఏకంగా రోడ్డును ఆక్రమించి చదును చేశారు. ఫిర్యాదు అందుకున్న బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు హుటాహుటినా సిబ్బందితో అక్కడికి చేరుకొని.. ఆక్రమణను తొలగించారు. అధికారుల తక్షణ స్పందనను చూసిన స్థానికులు.. ఎంతో సంతోషించారు. ఇక్కడ సీన్ కట్ చేస్తే.. మరుసటి రోజే సదరు హోటల్ నిర్వాహకులు మళ్లీ రోడ్డును ఆక్రమించి.. వాహనాల పార్కింగ్‌కు అనువుగా మలుచుకున్నారు. తొలుత విపరీతంగా స్పందించిన అధికారులు.. రెండోసారి మాత్రం పట్టించుకోకపోవడంతో స్థానికులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. హోటల్ యాజమాన్యం నుంచి అధికారులకు 'మర్యాదలు' జరిగాయని, అందుకే రోడ్డు ఆక్రమణను చూసీచూడనట్లు వదిలేస్తున్నారంటూ..స్థానికులు చెబుతున్నారు.

-ఎర్రగడ్డ, ఆగస్టు 18


